సాక్షి జగిత్యాల

శుక్రవారం । 25 । అక్టోబర్ । 2024



ఇంటర్ విద్యార్థులకు వరం

ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఇంటర్ బోర్డు కృషి చేస్తోంది. ఈ ఏడాది నుంచి ఎంసెట్, జేఈఈ, నీట్ కోసం శిక్షణ ప్రారంభించింది. -IIలో



డాటా ఎంట్రీ పేరుతో మోసం

ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నకిలీ ఏజెంట్లు యువకులను కంప్యూటర్ ఆపరేటర్ డాటా పేరిట లావోస్ పంపిస్తూ అక్కడ సైబర్ నేరాల వలలో దింపుతున్నారు. -IIలో

గరిష్ఠం/కనిష్ఠం 30.0/23.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

మెట్‌పల్లి సివిల్ కోర్టు మేజిస్ట్రేట్‌గా నాగేశ్వర్‌రావు



మొక్క అందిస్తున్న న్యాయవాదులు

మెట్‌పల్లి: పట్టణంలోని సివిల్ కోర్టు మేజిస్ట్రేట్‌గా డీ.నాగేశ్వర్‌రావు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, న్యాయవాదులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. బార్, బెంచ్ మధ్య స్నేహపూర్వక సంబంధం ఉండాలని నాగేశ్వర్‌రావు ఆకాంక్షించారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలని సూచించారు.

సబ్‌కోర్టు జడ్జిగా వెంకట మల్లిక్ సుబ్రహ్మణ్య శర్మ



వెంకటమల్లిక్ సుబ్రహ్మణ్యశర్మ

జగిత్యాలజోన్: జగిత్యాల సబ్‌కోర్టు జడ్జిగా కె.వెంకట మల్లిక్ సుబ్రహ్మణ్య శర్మ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా జడ్జి నీలిమను మర్యాదపూర్వకంగా కలిశారు. శర్మ ఇప్పటివరకు రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీలో పనిచేశారు. బదిలీపై జగిత్యాల సబ్ కోర్టుకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన కె.ప్రసాద్‌ను జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శిగా బదిలీ చేశారు.

ఎస్సారెస్పీలోకి 14,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాలఅగ్రికల్చర్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 14,454 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు గేట్లను మూసివేసిన అధికారులు వరద నీటిని వివిధ మార్గాల ద్వారా వదులుతున్నారు. కాకతీయ కాలువకు 5,800 క్యూసెక్కులు, వరద కాల్వకు 5వేలు, ఎస్కేప్ ద్వారా 2200, లక్ష్మీ కెనాల్‌కు 150, మిషన్ భగీరథకు 231, సరస్వతి కెనాల్‌కు 500 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు.

చేనేత ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్‌గా మల్లేశం



గంగమల్లేశం

పెగడపల్లి: చేనేత ఐక్యవేదిక క్రమశిక్షణ సంఘం రాష్ట్ర చైర్మన్‌గా మండలంలోని నందగిరికి చెందిన గాజుల గంగమల్లేశం నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ నియామక పత్రం అందించారు. గంగమల్లేశం మాట్లాడుతూ.. రాష్ట్ర కమిటీ సభ్యుల సహకారంతో పద్మశాలీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. నియామకానికి సహకరించిన పద్మశాలీ సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

'బీఆర్‌ఎస్‌లోనే ఉన్నాననడం విడ్డూరం'

- కాంగ్రెస్ కండువా కప్పుకున్నప్పుడే సంజయ్ ఆ పార్టీ వ్యక్తి..
- జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత



మాట్లాడుతున్న దావ వసంత

జగిత్యాల: జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తాను బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేయలేదని మొసలి కన్నీరు కారుస్తున్నారని, కాంగ్రెస్ కండువా కప్పుకున్నప్పుడే ఆ పార్టీ వ్యక్తి అయ్యాడని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ బీ ఫాంపై గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే మాటలు విడ్డూరంగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ సభ్యత్వం తీసుకోకుంటే పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశానికి ఎందుకు హాజరయ్యారని ప్రశ్నించారు. ఒకసారి కవిత ప్రోత్సాహంతో బీఆర్‌ఎస్‌లోకి వచ్చానని, మరోసారి తమది కాంగ్రెస్ కుటుంబమని సోయి తప్పి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే పదవి పోతుందనే భయంతో అడ్డదిడ్డం మాట్లాడుతున్నారన్నారు. గంగారెడ్డి హత్యను బీఆర్‌ఎస్ పార్టీ ఖండిస్తోందన్నారు. ఆయన హత్యతో బీఆర్‌ఎస్‌కు ఎలాంటి సంబంధమూ లేదని, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తున్నామని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ ప్రజల కోసం పోరాటం చేస్తుందని, హత్య రాజకీయాలకు దూరంగా ఉంటుందని వెల్లడించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు గట్టు సతీశ్, ఆనందరావు, దేవేందర్‌నాయక్, శీలం ప్రియాంక, గంగాధర్, మహేశ్, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

ఆగని ఇసుక రవాణా

మెట్‌పల్లి మండలంలోని ఓ గ్రామంలో ఇటీవల ఇసుక విక్రయాలకు వేలం నిర్వహించారు. స్థానికంగా ఉన్న కాల్వలోని ఇసుక తరలించేందుకు అదే గ్రామానికి చెందిన కొందరు ముందుకు వచ్చారు. వేలం రూ.లక్షల్లోకి చేరినా.. కొందరు గ్రూపుగా ఏర్పడి దక్కించుకున్నారు..

ఇదే మండలంలోని మరో గ్రామంలోని వాగులో అర్ధరాత్రి జేసీబీలతో ఇసుక తవ్వుతూ తరలిస్తున్నారు. కొన్నిరోజుల క్రితం గ్రామానికి చెందిన కొందరు ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్నారు. అధికారులకు ఫిర్యాదు కూడా చేశారు. కొంత కాలం ఇసుక తరలింపు నిలిచిపోయినా.. తాజాగా యథేచ్ఛగా సాగుతున్నాయి..



వాగులో ఇసుక నింపుతున్న కూలీలు

- యథేచ్ఛగా తరలుతున్న వైనం
- ఇష్టారీతిన వ్యవహరిస్తున్న అక్రమార్కులు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- అడ్డుకట్టపై అధికారుల నిర్లక్ష్యం

మెట్‌పల్లిరూరల్/కోరుట్ల: వాగులు ఇసుక అక్రమ రవాణాదారులకు కాసులు కురిపిస్తున్నాయి. తవ్వుకున్నోళ్లకు తవ్వుకున్నంత అన్న చందంగా ఇసుకను అడ్డగోలుగా రవాణా చేస్తున్నారు. అందినకాడికి సహజ సంపదను కొల్లగొడుతూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నప్పటికీ అడ్డుకోవాల్సిన అధికారులు మాములుగా వ్యవహరిస్తున్నారు. అడిగేవారు లేరని, అడ్డుకునేవారు అసలే లేరన్న ధీమాతో వ్యాపారులు అడ్డుఅదుపులేకుండా ఇసుక తరలిస్తున్నారు. మెట్‌పల్లి మండలంలోని కొన్ని గ్రామాల నుంచి బహిరంగంగానే ఇసుక పెద్ద ఎత్తున తరలిపోవడం షరా మాములుగా మారింది.

వాగుల నుంచి తవ్వకాలు

మెట్‌పల్లి మండలంలోని ఆత్మకూర్, ఆత్మనగర్, రామలచ్చక్కపేట గ్రామాల్లో వాగులు, కాలువల నుంచి ఇసుక తవ్వకాలు చేపట్టి డంప్ చేస్తున్నారు. ఈ డంప్‌ల నుంచి మెట్‌పల్లి పట్టణం, చుట్టుపక్క గ్రామాలతోపాటు పొరుగునే ఉన్న నిజామాబాద్ జిల్లాలోని పలు గ్రామాలకు ట్రాక్టర్లు, టిప్పర్లలో తరలిస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా రవాణా చేస్తున్న వ్యాపారులు భారీగానే సొమ్ము చేసుకుంటున్నారు. ఈ మూడు గ్రామాల నుంచి ఇసుకను కొందరు ప్రధాన రహదారి మీదుగా.. మరికొందరు వరదకాలువ, కాకతీయ కాలువ వెంబడి తీసుకెళ్తున్నారు. నిత్యం వందలాది ట్రాక్టర్లలో ఇసుక తరలిపోతున్నా అధికారులు అడ్డుకట్ట వేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

అధికారుల కనుసన్నల్లోనే..?

సిండికేట్ల పంచాయితీ అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. పంచాయితీ సద్దుమణిగితే రెండు వర్గాల నుంచి తమకు మామూళ్లు అందుతాయన్న ఉద్దేశంతోనే పట్టనట్లు వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఇసుక పంచాయితీ వెనక కొంతమంది అధికారుల హస్తం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఏరియాల వారీగా అక్రమంగా ఇసుక దందా పంపకాలకు సిద్ధం కావడం.. దీని కోసం పంచాయితీలు పెట్టుకుంటున్న సిండికేట్ల తీరు ముందు ముందు ఎలాంటి విపత్కరమైన పరిస్థితులకు దారితీస్తుందోనన్న చర్చ కోరుట్లలో జోరుగా సాగుతోంది.

మూడు రోజులుగా పంచాయితీ

కోరుట్ల మండలంలోని ఓ గ్రామ శివారు వాగు నుంచి కోరుట్ల, మెట్‌పల్లి, జగిత్యాల, ఆర్మూర్, నిజామాబాద్ పరిసరాలకు ఇసుక రవాణా అవుతోంది. దీంతో కలెక్టర్ ఇసుక ట్రాక్టర్ పట్టుబడితే రూ. 25వేలు, టిప్పర్ దొరికితే రూ.50 వేలు జరిమానా విధించాలని ఆదేశించారు. ఈ క్రమంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న సుమారు 44 ట్రాక్టర్లను పట్టుకున్న రెవెన్యూ అధికారులు రూ.25వేల చొప్పున జరిమానా వసూలు చేశారు. దీంతో ఆ గ్రామానికి చెందిన ఇసుక వ్యాపారులు రవాణాను నిలిపేసి మళ్లీ యథావిధిగా తరలిస్తున్నారు. ఈ క్రమంలో కోరుట్లకు చెందిన ఇసుక ట్రాక్టర్ల సిండికేట్ వారం క్రితం వీరిని అడ్డుకున్నారు. పట్టణంలో తాము ఇసుక సరఫరా చేస్తుండగా మీరు ఎలా తెస్తారని ప్రశ్నించారు. రెండుమూడు సార్లు ట్రాక్టర్లను ఖాళీ చేయించి తిప్పిపంపారు. దీంతో ఇసుక సిండికేట్ల మధ్య పంచాయితీ మొదలైంది.

రీచ్‌లు, స్టాక్ పాయింట్లు నిల్

ప్రజల అవసరాల కోసం మండలంలో ఇసుక రీచ్‌లు, స్టాక్ పాయింట్‌లు లేవు. ఇది వినియోగదారులకు సమస్యగా మారింది. వ్యాపారులు చెప్పిన ధరకే కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. స్టాక్ పాయింట్, రీచ్ గానీ లేకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. గతంలో ఖనిజాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలో స్టాక్ పాయింట్లను ఏర్పాటు చేశారు. అయితే ధర ఎక్కువగా ఉండడంతో వినియోగదారులు పెద్దగా ఆసక్తి చూపక వాటిని ఎత్తివేశారు.

నంబర్ ప్లేట్లు లేకుండానే..

వాగుల నుంచి అనుమతుల్లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లకు నంబర్ ప్లేట్లు కూడా ఉండడం లేదు. మైనర్లే డ్రైవింగ్ చేస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. కొద్దిరోజుల క్రితం మెట్‌పల్లి మీదుగా నిజామాబాద్ జిల్లాకు లారీల్లో ఇసుక తరలిస్తుండగా సీఐ నిరంజన్‌రెడ్డి గమనించి అడ్డుకట్ట వేశారు.

చర్యలు తీసుకుంటున్నాం

ఇసుక అక్రమ రవాణాపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. ఇటీవల కొన్ని ట్రాక్టర్లను పట్టుకున్నాం. అర్ధరాత్రి సమయంలో ఇసుక తీసుకెళ్తున్నట్లు సమాచారం ఉంది. ఆ ప్రాంతాలకు వెళ్లాలంటే పోలీస్ ప్రొటెక్షన్ తప్పనిసరి. ఆత్మకూర్ పెద్దవాగు రీచ్ కోసం ఇటీవల ప్రతిపాదనలు పంపించాం.

– శ్రీనివాస్, తహసీల్దార్, మెట్‌పల్లి

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



పొరండ్లలోని ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

- కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల: జిల్లా పరిషత్ కింద మంజూరైన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. గురువారం జెడ్పీ కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. పనులు మంజూరై పెండింగ్‌లో ఉన్నవాటిని పూర్తి చేయాలన్నారు. మున్సిపాలిటీల్లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను ఆదివారంలోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్లను ఆదేశించారు. ఎల్‌ఆర్‌ఎస్ బృందం ప్రతిరోజూ 20 దరఖాస్తులు పూర్తి చేసి అడిషనల్ కలెక్టర్‌కు రిపోర్ట్ అందించాలన్నారు.

ఫిబ్రవరి 21 వరకు పశుగణన

ఫిబ్రవరి 21వరకు జిల్లాలో పశుగణన చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. గురువారం సంబంధిత పోస్టర్ ఆవిష్కరించారు. రెవెన్యూ గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని సర్వే చేపడతారని, ఇందుకు 115 మంది ఎన్యుమరేటర్లను గుర్తించామని పేర్కొన్నారు.

ఒకటిన బీసీ కమిషన్ బృందం రాక

స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్ల విషయంపై రాజకీయ పార్టీలు, సంఘాలు, ప్రజల అభిప్రాయాలు తెలుసుకునేందుకు వచ్చేనెల ఒకటిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు బీసీ కమిషన్ బృందం రానున్నట్లు కలెక్టర్ తెలిపారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో బీసీ వెల్ఫేర్ కమిషనర్లతో కూడిన బృందం ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బంది ఉండొద్దు

జగిత్యాలరూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. గురువారం జగిత్యాలరూరల్ మండలం పొరండ్ల, గుల్లపేటలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. రైతులు తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని తేవాలన్నారు. పాడీక్లీనింగ్ మిషన్లు, టార్పాలిన్ కవర్లు, గన్ని సంచులు అందుబాటులో ఉంచాలని నిర్వాహకులకు సూచించారు. ఆర్డీవో శ్రీనివాస్, అడిషనల్ డీఆర్డీఏ మదన్‌మోహన్, డీఎస్‌వో జితేందర్‌ప్రసాద్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రమాదేవి, ఏపీఎం గంగాధర్ పాల్గొన్నారు.

పండ్ల మొక్కలు పెంచాలి

పల్లె ప్రకృతి వనాల్లో పండ్ల మొక్కలు పెంచాలని కలెక్టర్ అన్నారు. పొరండ్లలోని పల్లెప్రకృతివనం, వైకుంఠధామం, వర్మికంపోస్ట్, డంపింగ్‌యార్డులను పరిశీలించారు. పంచాయతీల్లో ట్రాక్టర్ల ద్వారా తడి, పొడిచెత్తను వేర్వేరుగా సేకరించాలన్నారు. తడి చెత్తతో వర్మికంపోస్ట్ తయారు చేయించాలని సూచించారు.

ఆయుధాలపై అవగాహన

- పాల్గొన్న ఎస్పీ అశోక్‌కుమార్



ఆయుధాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్పీ

జగిత్యాలక్రైం: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గురువారం ఓపెన్‌హౌస్ నిర్వహించారు. పోలీసు శాఖ ప్రజలకు అందిస్తున్న సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు సమాజంలో పరిణామాలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు దగ్గరవుతూ శాంతిభద్రతలను కాపాడుతున్నట్లు పేర్కొన్నారు. మహిళలు, విద్యార్థినుల రక్షణకు షీటీంలు, భరోసా సెంటర్‌లు పనిచేస్తాయన్నారు. బాంబ్‌స్క్వాడ్స్, సైబర్ నేరాలపై వివరించారు. సైబర్ క్రైం జరిగితే టోల్ ఫ్రీనంబర్ 1930కు కాల్ చేయాలని సూచించారు. అడిషనల్ ఎస్పీ భీంరావ్, డీఎస్పీ రఘుచందర్, ఆర్‌ఐలు కిరణ్‌కుమార్, రామకృష్ణ, వేణు, ఐటీకోర్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, రఫిక్‌ఖాన్, ఫింగర్ ప్రింట్స్ సీఐ రాజు, ఆర్‌ఎస్సైలు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు నిధులు

- ఉమ్మడి జిల్లాకు రూ.43.03 కోట్లు మంజూరు

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆగస్టు, సెప్టెంబర్ నెలలో కురిసిన భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న గ్రామీణ రోడ్ల మరమ్మతులకు, అంతర్గత రహదారుల నిర్మాణానికి గాను రూ.43 కోట్ల 3 లక్షల 26 వేల నిధులను మంజూరు చేస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ సెక్రటరీ లోకేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ జిల్లాలో ఐదు మున్సిపాలిటీల్లో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతుకు రూ.2 కోట్ల 91 లక్షల 26వేలు మంజూరయ్యాయి. 304 అండర్ కన్‌స్ట్రక్షన్ రూరల్ రోడ్ల(సీఆర్‌ఆర్) పనులకు, 160 అండర్ మండల రహదారుల మరమ్మతుల(ఎంఆర్‌ఆర్) గ్రాంట్స్‌కుగాను ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 56.23 కి.మీటర్లకు రూ.40 కోట్ల 12 లక్షలను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో నిధులు మంజూరై పనుల్లో జాప్యం జరగడం వల్ల ల్యాప్స్ అయిన పనులకు గాను నిధులను మంజూరు చేస్తూ యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. చొప్పదండి నియోజకవర్గం మల్యాల మండలం రాజారాం టు పోతారం రోడ్డుకు రూ.60 లక్షలు, రామడుగు మండలం శ్రీరాములపల్లి టు బూర్గుపల్లి వయా కారుపాకలపల్లి రోడ్డుకు రూ.2కోట్ల 50 లక్షలు, గంగాధర మండలం గర్షకుర్తి వయా కాసారం రోడ్డుకు రూ.2 కోట్ల50 లక్షలు, బోయినపల్లి మండలం నల్గొండ టు అనంతపల్లి రోడ్డుకు రూ.6కోట్లు, ధర్మపురి నియోజకవర్గం బుగ్గారం సీసీ రోడ్డు మద్దునూర్‌కు రూ.కోటి, కరీంనగర్ కాజీపూర్ ఎస్సీ కాలనీ వయా కాపువాడ, ఎరుకలవాడ రోడ్డుకు రూ.4 కోట్ల 50లక్షలు, గోపాల్‌పూర్ అప్రోచ్ రోడ్డుకు రూ.కోటి 50 లక్షలు, బొమ్మకల్ టు మల్లికార్జున టెంపుల్ రూ.కోటి 50లక్షలు, మొగ్దుంపూర్ ఎస్సీ కాలనీ రోడ్డుకు రూ.కోటి, బొమ్మకల్ దుర్గమ్మ టెంపుల్ రోడ్డు రూ.4కోట్లు, నాగుల మల్యాల టు నర్సింగాపూర్ రోడ్డుకు రూ.2కోట్లు, మల్కాపూర్ రోడ్డుకు రూ.60లక్షలు, మానకొండూరు నియోజకవర్గం తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి సీసీ రోడ్డు, డ్రైనేజీలకు రూ.3 కోట్లు, తిమ్మాపూర్ మండలం సీసీ రోడ్డు, డ్రైనేజీలకు రూ.2కోట్లు, వేములవాడ నియోజకవర్గం కథలాపూర్ మండలం భూషణ్‌రావుపేట టు ఆత్మకూరు రోడ్డుకు రూ.2కోట్లు, కథలాపూర్ మండలం చింతకుంట సీసీరోడ్డు పనులకు రూ.2 కోట్లు, వేములవాడ మండలం చెక్కపల్లి టు వట్టిముల రోడ్డుకు రూ.2కోట్ల 60 లక్షలు, బోయినపల్లి మండలం మల్కాపూర్ సీసీ రోడ్డుకు రూ.3కోట్లు, బోయినపల్లి మండలం నర్సింగాపూర్ సీసీ రోడ్డుకు రూ.5 కోట్లు, హుజూరాబాద్ నియోజకవర్గంలో కాట్రపల్లి సీసీ రోడ్డు రూ. 8 కోట్లు, వీణవంక మండలం ఇప్పలపల్లి రోడ్డుకు రూ.60 లక్షలు, వేములవాడ అర్బన్‌లో రోడ్ల మరమ్మతుకు రూ.4 కోట్లు మొత్తంగా 56.23 కి.మీటర్లకు గాను రూ.40 కోట్ల 12 లక్షలు నిధులు విడుదలయ్యాయి.

కరీంనగర్ జిల్లాకు రూ. 2.91 కోట్లు...

జిల్లాలోని ఐదు మున్సిపాల్టీలలో ఇటీవల కురిసిన వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లను మరమ్మతులు చేసేందుకు రూ.2 కోట్ల 91 లక్షల 26 వేలు నిధులు మంజూరయ్యాయి. కరీంనగర్ నగరపాలక సంస్థలో 21 పనులకు గాను రూ. 50 లక్షలు, కరీంనగర్ సిటీలో ఈఈ ఆర్‌అండ్‌బీ 9 పనులకు రూ.38.26 లక్షలు, కరీంనగర్ పంచాయతీరాజ్ ఇంజినీర్‌లో 25 పనులకు గాను రూ. 1.23 లక్షలు, జమ్మికుంట మున్సిపాల్టీకి రూ.20 లక్షలు, హుజూరాబాద్ మున్సిపాల్టీకి రూ.20 లక్షలు, కొత్తపల్లికి రూ.20 లక్షలు, చొప్పదండికి రూ.20లక్షల చొప్పున మొత్తంగా రూ.2కోట్ల 91 లక్షల 26వేలు మంజూరయ్యాయి.

అన్నదాతలను ఇబ్బంది పెట్టొద్దు

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్
- నామాపూర్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న విప్

పెగడపల్లి: కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బంది పెట్టొద్దని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ నిర్వాహకులకు సూచించారు. మండలంలోని ల్యాగలమర్రి, రామభద్రునిపల్లి, రాజరాంపల్లి, నామాపూర్, అయితిపల్లి, మద్దులపల్లి గ్రామాల్లో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ప్రారంభించారు. నాణ్యమైన ధాన్యం విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. సన్నధాన్యానికి రూ.500 బోనస్ రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. మాజీ జెడ్పీటీసీ రాజేందర్‌రావు, తహసీల్దార్ రవీందర్, సివిల్ సప్లై డీఎం జితేంద్ర ప్రసాద్, సెర్ప్ డీపీఎం మల్లేశం, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి శోభారాణి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములు పాల్గొన్నారు.

మెట్‌పల్లిలో కేటీఆర్‌కు స్వాగతం



మెట్‌పల్లి: పట్టణం మీదుగా కరీంనగర్‌కు వెళ్తున్న మాజీమంత్రి కేటీఆర్‌కు గురువారం స్థానిక పాత బస్టాండ్ వద్ద బీఆర్‌ఎస్ నాయకులు స్వాగతం పలికారు. ముందుగానే సమాచారమందుకున్న నాయకులు అక్కడికి పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. కేటీఆర్ రాగానే బాణాసంచా కాల్చి సందడి చేశారు. దీంతో కేటీఆర్ అక్కడ కొద్దిసేపు ఆగి వారికి అభివాదం చేశారు. ఆయన వెంట కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ ఉన్నారు.

నృసింహుని సన్నిధిలో బాలబ్రహ్మానంద సరస్వతి



స్వామివారికి ఫొటో బహూకరిస్తున్న అర్చకులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామివారిని గురువారం బాల బ్రహ్మానంద సరస్వతి నైమిశారణ్య పీఠాధిపతులు దర్శించుకున్నారు. స్వామికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈవో శ్రీనివాస్ ఆయనకు తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని శేషప్ప కళావేదికపై శ్రీలక్ష్మీనృసింహుడి లీలావిలాసం ప్రవచనం ఇచ్చారు. వేద పండితులు బొజ్జ రమేశ్‌శర్మ, ఉప ప్రధాన అర్చకులు నేరెల్ల శ్రీనివాసచార్యులు, సీనియర్ అసిస్టెంట్ అలువాలు శ్రీనివాస్ తదితరులున్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- అవసరమైనప్పుడు కాంగ్రెస్ సభ్యత్వం తీసుకుంటా
- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



రాయికల్: ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నర్సింగ్ సిబ్బంది

జగిత్యాల/రాయికల్: జగిత్యాల ప్రాంత అభివృద్ధే తన లక్ష్యమని, ప్రభుత్వంతో కలిసి పనిచేస్తానని, అవసరమైన సమయంలో కాంగ్రెస్ సభ్యత్వం తీసుకుంటానని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. తమ కుటుంబం స్వాతంత్య్రం రాకముందునుంచే కాంగ్రెస్‌లో ఉందని గుర్తు చేశారు. ప్రజలకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశానని తెలిపారు.

ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్య పెంచాలి

రాయికల్ ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని, ఆస్పత్రిలో సాధారణ ప్రసవాలకు వైద్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే అన్నారు. గురువారం ఆస్పత్రిలో నిర్వహించిన హెచ్‌డీఎస్ సమావేశంలో మాట్లాడారు. దశాబ్దాల క్రితం ఆస్పత్రిని నిర్మించారని, లీకేజీలతోపాటు డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, ఆ సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మరుగుదొడ్ల నిర్మాణం చేపడతామన్నారు. నర్సింగ్ సిబ్బంది 317 జీవోతో తమకు అన్యాయం జరుగుతోందంటూ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై అసెంబ్లీలో ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, వైస్ చైర్మన్ రమాదేవి, డీసీహెచ్‌ఎస్ రామకృష్ణ, సూపరింటెండెంట్ శశికాంత్‌రెడ్డి, తహసీల్దార్ ఖయ్యూం పాల్గొన్నారు.

హద్దురాళ్లకు పైసలు లేవట..!

- డబ్బులు లేవన్న సాకుతో ఎండోమెంట్ తాత్సారం

కోరుట్ల: కోరుట్ల శ్రీ వేంకటేశ్వర ఆలయానికి కేటాయించిన విలువైన భూములు ఇప్పటికే చాలాచోట్ల కబ్జాదారుల పాలయ్యాయి. మిగిలిన భూమి పట్టణంలో అక్కడక్కడ మిగిలి ఉండగా..ఆ భూమిని కాపాడుకునే విషయంలోనూ ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ మీనమేషాలు లెక్కిస్తోంది. రెండు నెలల క్రితం ఆలయ భూముల సర్వే చేసి లెక్కతేల్చారు. దాదాపు రూ.10 కోట్ల విలువైన ఎకరం భూమి కబ్జాకు గురైనట్లు తేలినా సదరు భూమికి హద్దురాళ్ల ఏర్పాటు చేసే విషయంలో అధికారులు తాత్సారం చేస్తున్నారు. కేవలం హద్దురాళ్లకు డబ్బులు లేవన్న సాకుతో హద్దులు ఏర్పాటు చేయడంలో చూపుతున్న నిర్లక్ష్యం ఫలితంగా మళ్లీ కబ్జాదారులు కొత్త లోసుగులు వెతికి కబ్జా నుంచి కదలకుండా ఉండాలన్న యత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

సర్వే చేయడం.. వదిలేయడం..

వేంకటేశ్వర ఆలయ భూములు కబ్జాల పాలవుతున్నాయని సుమారు పది సంవత్సరాల కాలంగా ఆరోపణలు వచ్చాయి. స్థానికుల నుంచి ఆరోపణలు వచ్చిన ప్రతీసారి ఎండోమెంట్, రెవెన్యూ అధికారులు హడావుడి చేసి అయిలాపూర్ రోడ్ వెంట 1499, 1399/1,1492,1521 సర్వే నంబర్లలో ఉన్న వెంకటేశ్వర ఆలయ భూములను జాయింట్ సర్వే చేయించడం ఆనవాయితీగా మారింది. కబ్జాకు గురైన ఆలయ భూముల లెక్క తేలినా ఆ భూములకు హద్దురాళ్లను పెట్టి వదిలేస్తున్నారు. అనంతరం ఆ సర్వే నంబర్లపై నిఘా లేకపోవడంతో కొందరు కబ్జాదారులు మళ్లీ హద్దురాళ్లను తొలగించి యథావిధిగా కబ్జాల్లోకి వెళ్లడం జరుగుతోంది. ఈ తంతును ఎండోమెంట్ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించడం..తరువాత కాలంలో కబ్జాదారులు కోర్టులను ఆశ్రయించడానికి అవకాశం చిక్కడం.. ఫలితంగా ఆలయ భూములు తిరిగి ఎండోమెంట్ పరిధిలోకి రావడం లేదు. మూడు నెలల క్రితం గతంలో సర్వే చేసి తేల్చినా వెంకటేశ్వర ఆలయ భూమిలో బిల్డర్లు ఇళ్ల నిర్మాణానికి పూనుకోవడం..బోర్లు వేయడంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. స్థానికులు కొందరు మళ్లీ ఆలయ భూముల కబ్జా విషయంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ సీరియస్ కావడంతో పాటు మళ్లీ పూర్తిస్థాయి సర్వేకు ఆదేశించారు. రెండు నెలల క్రితం మరోసారి ఎండోమెంట్, రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. ఈ సర్వేలో సుమారు రూ. 10 కోట్ల విలువైన ఎకరం ఆలయ భూమి కబ్జాకు గురైనట్లు తెలింది. కబ్జాకు గురైన ఆలయ స్థలానికి మార్కింగ్ చేసిన అధికారులు వెంటనే శాశ్వతంగా ఉండే హద్దురాళ్ల నిర్మించడంలో తాత్సారం చేశారు.

క్లుప్తంగా

బహ్రెయిన్‌లో వేంపేట వాసి మృతి


మారంపెల్లి సుధీర్‌(ఫైల్‌)

మెట్‌పల్లిరూరల్‌: ఉపాధి నిమిత్తం బహ్రెయిన్‌ వెళ్లిన ఓ వ్యక్తి అక్కడే మృతి చెందాడు. మెట్‌పల్లి మండలం వేంపేట గ్రామానికి చెందిన మారంపల్లి సుధీర్‌ (35) బహ్రెయిన్‌లో ఉరివేసుకొని మృతి చెందినట్లు అక్కడున్న పలువురు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. రెండున్నర ఏళ్ల క్రితం విదేశానికి వెళ్లిన సుధీర్‌ ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి తాను ఉంటున్న గదిలోనే ఆత్మహత్య చేసుకున్నాడని, అప్పుల బాధతోనే ప్రాణాలు తీసుకున్నాడని గ్రామస్తులు అంటున్నారు. సుధీర్‌కు భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ఇష్టం లేని వివాహం చేశారని యువకుడి ఆత్మహత్య

గంగాధర(చొప్పదండి): మండలంలోని నారాయణపూర్‌కు చెందిన చింతలతాడెం మహేశ్‌ (29) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. మహేశ్‌కు అతని తల్లి 6 నెలల క్రితం ఇష్టం లేని వివాహం జరిపించింది. దీంతో మనస్తాపానికి గురైన అతను బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. తల్లి ఇష్టం లేని పెళ్లి చేసినందుకే ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పత్తి మార్కెట్లో నాగుపాము హల్‌చల్‌


నాగుపామును బంధిస్తున్న నాగార్జున

జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ పత్తి మార్కెట్‌ యార్డులో గురువారం నాగుపాము హల్‌చల్‌ చేసింది. ఉదయం మార్కెట్‌ కార్యాలయం ఎదుట ఉన్న యార్డులోకి నాగుపాము రావడంతో రైతులు, వ్యాపారులు, అధికారులు సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. మార్కెట్‌లో వాచ్‌మెన్‌గా పనిచేసే అప్పాల నాగార్జున నాగుపామును బంధించి జన సంచారం లేని ప్రదేశంలో వదిలేశాడు.

నలుగురిపై పిచ్చికుక్క దాడి

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని శివంగాలపల్లిలో గురువారం పిచ్చికుక్క దాడిలో నలుగురు గాయపడ్డారు. బెజగం ధర్మయ్య, తాటికొండ వాణి, సావనపెల్లి శ్రీకాంత్‌, అంజిలను పిచ్చికుక్క కరిచింది. బాధితులు కోనరావుపేట పీహెచ్‌సీకి రాగా గాయాలు పెద్దవిగా ఉండడంతో సిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా కొన్ని రోజులుగా మండలంలో కుక్కల బెడద తీవ్రమైంది. బుధవారం కోనరావుపేటలో ఐదుగురిపై కుక్క దాడి చేసిన విషయం మరువకముందే గురువారం శివంగాలపల్లిలో నలుగురిపై దాడిచేయడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

డాటా ఎంట్రీ పేరుతో ఏజెంట్ల మోసం

- 'లావోస్‌' సైబర్‌క్రైం ఉచ్చులో తెలంగాణవాసులు
- ఆహారం దొరక్క ఇబ్బందిపడుతున్న యువకులు

జగిత్యాలక్రైం: ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నకిలీ ఏజెంట్లు తెలంగాణకు చెందిన పలువురు యువకులకు కంప్యూటర్‌ ఆపరేటర్‌ డాటా పేరిట లావోస్‌ పంపిస్తూ అక్కడ సైబర్‌ నేరాల వలలో దింపుతున్నారు. సైబర్‌ నేరాలు చేసేందుకు నిరాకరించిన వారిపై అక్కడి వారు దాడులకు పాల్పడుతున్నారు. ఇటీవల లావోస్‌లోని గోల్డెన్‌ ట్రయాంగిల్‌ సిటీకి చేరుకుని 10 రోజుల పాటు నరకం అనుభవించి ఎట్టకేలకు స్వదేశం చేరుకున్న వారు తమ అనుభవాలను 'సాక్షి'కి వెల్లడించారు.

థాయిలాండ్‌, చైనా, దావోస్‌ మధ్య సైబర్‌ అడ్డా

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రాలకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులను కంప్యూటర్‌ డాటా ఎంట్రీ పేరుతో కొంత మంది ఏజెంట్లు నమ్మించి విజిట్‌ వీసాలపై మొదట థాయిలాండ్‌ పంపిస్తున్నారు. అక్కడి నుంచి నేరుగా బస్సులు, ట్యాక్సీల ద్వారా థాయిలాండ్‌ సరిహద్దుల్లో 600 బాత్‌లు (రుసుము), లావోస్‌ సరిహద్దుల్లో 600 బాత్‌లు (రుసుము) చెల్లిస్తే ఇమిగ్రేషన్‌ వారు ఆ దేశానికి అనుమతిస్తున్నారు. అక్కడికి చేరుకున్న తర్వాత కొంత మంది బినామీ పేర్లు పెట్టుకుని వచ్చి ఇక్కడి ఏజెంట్లు పంపించిన ఫొటోల ఆధారంగా నిరుద్యోగ యువతను గుర్తించి, వారి పాస్‌పోర్టులు తీసుకుని సైబర్‌ ఉచ్చులో దింపుతున్నారు. ఆ పనిని నిరాకరించిన వారిని పట్టణ సరిహద్దుకు తీసుకెళ్లి కంటైనర్‌లో పడేసి చిత్రహింసలకు గురిచేస్తున్నట్లు బాధితులు వాపోయారు.

సైబర్‌ నేరాలకు అడ్డా గోల్డెన్‌ ట్రయాంగిల్‌ సిటీ..

సైబర్‌ నేరాలకు పాల్పడే చాలా మంది చైనీస్‌లు లావోస్‌లోని గోల్డెన్‌ట్రయాంగిల్‌ సిటీని అడ్డాగా ఎంచుకుని తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. తమ కార్యకలాపాలు కొనసాగే చోట పనిచేసే యువతీ, యువకులపై కూడా సీసీకెమెరాల నిఘాతో పర్యవేక్షిస్తుంటారు. వారి పర్యవేక్షణలో ఏదైనా పొరపాట్లు చేస్తే కఠినంగా శిక్షించడంతో పాటు, చిత్రహింసలకు గురిచేస్తుంటారు.

చైనీయుల పేరుతో ఐడీలు..

ఇక్కడి నుంచి లావోస్‌కు చేరుకున్న యువతీ, యువకులకు చైనీయుల పేరుతో ఐడీలు ఇస్తుంటారు. అమ్మాయిల పేరుతో ప్రొఫైల్స్‌ తయారుచేసి అందమైన అమ్మాయిల ఫొటోలు పెట్టి వీరి ద్వారా ఫోన్లతో సైబర్‌ నేరాలకు పాల్పడేలా శిక్షణ ఇచ్చి నేరాలు చేయిస్తున్నారు.

స్వదేశం రావాలంటే రూ.2.50 లక్షలు..

లావోస్‌ చేరుకున్న యువతీ, యువకులు ఎవరైనా తమకు పని నచ్చడం లేదని, తాను పనిచేయలేనని మొండికేస్తే రూ.2.50 లక్షలు చెల్లిస్తేనే వారికి పాస్‌పోర్టులు ఇస్తున్నారు. డబ్బులు చెల్లించని వారిని తీవ్ర చిత్రహింసలకు గురిచేస్తుండటంతో వారు ఎట్టకేలకు సైబర్‌క్రైం చేసేందుకు మొగ్గు చూపుతున్నారు.


లావోస్‌లోని గోల్డెన్‌ ట్రయాంగిల్‌ సిటీ సైబర్‌క్రైం అడ్డా భవనం ఇదే

ఆహారం కోసం తిప్పలు

అక్కడ పనిచేస్తున్న వారికి సరైన సమయంలో ఆహారం దొరక్క నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనిచేయని వారికి మాత్రం తిండి, నీరు దొరకడం కష్టంగా ఉన్నట్లు తెలిపారు. దీంతో ఆహారం కోసమైనా వారు చెప్పిన పని చేయక తప్పడం లేదని బాధితులు వాపోయారు.

మూడు రాష్ట్రాల సరిహద్దుల్లో పటిష్ట భద్రత

- మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో అలర్ట్‌
- మూడు రాష్ట్రాల పోలీసు అధికారుల సమావేశం


హెలికాప్టర్‌తో తరలివెళ్తున్న రామగుండం సీపీ శ్రీనివాస్‌, పోలీసు అధికారులు

గోదావరిఖని(రామగుండం): మహారాష్ట్ర ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టుల కట్టడికి పటిష్ట భద్రతా చర్యలు తీసుకోవాలని మూడు రాష్ట్రాల పోలీసు అధికారులు నిర్ణయించారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గురువారం మహారాష్ట్ర, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌ పోలీసులు మూడు రాష్ట్రాల సరిహద్దు జిల్లాల అధికారులతో గడ్చిరోలి ఎస్పీ క్యాంపు ఆఫీస్‌లో డీజీపీ అంకిత్‌గోయల్‌ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈసమావేశానికి రామగుండం పోలీస్‌ కమిషనర్‌ ఎం.శ్రీనివాస్‌ అధ్యక్షత వహించగా, సరిహద్దు ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తల గురించి చర్చించారు. ముఖ్యంగా మావోయిస్టుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచి సంబంధిత సమాచారాన్ని పరస్పరం చేరవేసుకోవాలని నిర్ణయించారు. ఫలితంగా మావోయిస్టులను కట్టడి చేయడం సులభతరమవుతుందన్నారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ప్రవేశ, నిష్క్రమణ మార్గాల్లో చెక్‌ పోస్టులు ఏర్పాటు చేసి పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని తీర్మానించారు. నేరాల కట్టడి, కేసుల విషయంలో ఒకరికొకరు సహకరించుకుందామన్నారు. సమావేశంలో ఆపరేషన్స్‌ డీజీపీ అజయ్‌ శర్మ, కళ్యాణ్‌ ఎలేసెల, మొహాల మన్సూర్‌, నీలోత్పల్‌, నూరుల్‌ హసన్‌, భాంద్ర, ముమ్మక్క సుదర్శన్‌, గోరక్‌ బామరె, గొండియా కిరణ్‌కారే, రాబిన్సన్‌ గురియా, దినేశ్‌సింహ్‌, ఆసిఫాబాద్‌ ఎస్పీ శ్రీనివాసులు, భూపాల్‌పల్లి ఎస్పీ కిరణ్‌కారే, మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్‌, స్పెషల్‌ బ్రాంచి ఏసీపీ రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

జూడోలో ఒలింపిక్స్‌స్థాయికి ఎదగాలి

- రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి


గోల్డ్‌మెడల్‌ సాధించిన తేజ వర్షిణినిని అభినందిస్తున్న జనార్దన్‌రెడ్డి

కరీంనగర్‌స్పోర్ట్స్‌: సీబీఎస్‌ఈ జాతీయస్థాయి జూడో పోటీల్లో బంగారు పతకం సాధించినట్లే భవిష్యత్‌లో ఒలింపిక్స్‌స్థాయికి ఎదగాలని రాష్ట్ర జూడో సంఘం ప్రధాన కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి సూచించారు. జార్ఖండ్‌లోని సలజా గోల్డ్‌ ఇంటర్నేషనల్‌ స్కూల్‌ ఈ నెల 6 నుంచి 11వరకు జరిగిన సీబీఎస్‌ఈ నేషనల్‌ జూడో చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించిన వివేకానంద రెసిడెన్సియల్‌ స్కూల్‌కు చెందిన చిన్నారి ఎం.తేజవర్షిణిని గురువారం అభినందించారు. అండర్‌–14 విభాగంలో 23కేజీల కేటగిరీలో బంగారు పతకం సాధించడం గర్వకారణం అన్నారు. కోచ్‌ సత్యనారాయణ అభినందించారు. పాఠశాల చైర్మన్‌ పొల్సాని సుధాకర్‌రావు, అకడమిక్‌ డైరెక్టర్‌ లలితకుమారి, ప్రిన్సిపాల్‌ రేణుక, చిత్తరంజన్‌ మహాపాత్ర, వైస్‌ ప్రిన్సిపాల్‌ ప్రశాంత్‌, శ్రీధర్‌, రమణ, సుధాకర్‌, మహేందర్‌, శ్రీనివాస్‌ ఉన్నారు.

తమ్ముడి పేరిట భూ రిజిస్ట్రేషన్‌ చేయించారని..

- కుటుంబసభ్యులతో కలిసి ఇద్దరు సోదరుల ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యాయత్నం చేసిన బాధితులు

ఇల్లందకుంట(హుజూరాబాద్‌): తండ్రి తన పేరిట ఉన్న వ్యవసాయ భూమిని తమ్ముడి పేరిట రిజిస్ట్రేషన్‌ చేయించారని ఇద్దరు సోదరులు కుటుంబసభ్యులతో కలిసి ఆత్మహత్యాయత్నం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఇల్లందకుంట మండలంలోని శ్రీరాములపల్లికి చెందిన అంబరగొండ రాములకు ముగ్గురు కుమారులు సంజీవరావు, శ్రీనివాస్‌, తిరుపతి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. తనకున్న 21 ఎకరాల వ్యవసాయ భూమిలో మొదటి ఇద్దరు కుమారులకు ఐదెకరాల చొప్పున, కూతుళ్లకు రెండెకరాల చొప్పున, ఊరికి దూరంగా ఉన్న పొలానికి వెళ్లేందుకు దారి లేదని చిన్న కుమారుడికి 6 ఎకరాల భూమిని 20 ఏళ్ల క్రితం పట్టా చేయించాయి. ఒక ఎకరం భూమిని తన పేరిటే ఉంచుకున్నాడు. గురువారం ఆ భూమిని కూడా తమ్ముడు తిరుపతి పేరిట పట్టా చేయిస్తున్నాడని తెలుసుకొని, మొదటి, రెండో కుమారులు తమ కుటుంబసభ్యులతో కలిసి తహసీల్దార్‌ కార్యాలయానికి వచ్చారు. అక్కడే క్రిమిసంహారక మందు తాగేందుకు ప్రయత్నించగా సిబ్బంది అడ్డుకొని, పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని, బాధితులకు నచ్చజెప్పి, ఠాణాకు తీసుకెళ్లారు. ఈ విషయమై తహసీల్దార్‌ రాణిని వివరణ కోరగా అంబరగొండ రాములు తన చిన్న కుమారుడికి భూమిని సేల్‌ డీడ్‌ ద్వారా రిజిస్ట్రేషన్‌ చేయించారని తెలిపారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్‌ పోటీలకు అల్ఫోర్స్‌ విద్యార్థులు

కొత్తపల్లి: కొత్తపల్లి మండల పరిధిలోని అల్ఫోర్స్‌ టెక్నో పాఠశాలకు చెందిన ఎస్‌.నిశితల్‌ 8వతరగతి, డి.సహస్రరెడ్డి 9వతరగతి, ఎండీ.ముక్రాం 8వతరగతి, హేమంత్‌ 9వ తరగతి విద్యార్థులు ఎస్‌జీఎఫ్‌ రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్‌ పోటీలకు ఎంపికయ్యారు. వీరిని అల్ఫోర్స్‌ విద్యా సంస్థల చైర్మన్‌ వి.నరేందర్‌రెడ్డి గురువారం అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అయోడిన్‌ ఉప్పు తప్పనిసరి

జగిత్యాల: ఆహారంలో ఐదు గ్రాముల అయోడిన్‌ ఉప్పు ఉండేలా చూసుకోవాలని డీఎంహెచ్‌వో సమీయోద్దీన్‌ అన్నారు. గురువారం తన కార్యాలయంలో నేరెళ్ల వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. అయోడిన్‌ లోపంతో గర్భస్రావం, మృత శిశువు జననం, అసంపూర్ణ పిండమెదడు అభివృద్ధి, శారీరక లోపాలు తలెత్తుతాయన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్‌ డాక్టర్‌ అర్చన పాల్గొన్నారు.

నకిలీ ఫోన్‌ వస్తువుల అమ్మకాలపై కేసు


తనిఖీలు చేస్తున్న పోలీసులు

కరీంనగర్‌క్రైం: నగరంలో ఆపిల్‌ ఫోన్‌కు సంబంధించిన వస్తువులు నకిలీవి అమ్ముతున్నారన్న సమాచారంతో పలు మొబైల్‌ షాపులపై దాడులు చేసి, కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్‌ సీఐ బిల్లా కోటేశ్వర్‌ తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. ఆపిల్‌ ఫోన్‌ కంపెనీ సింబల్‌తో నకిలీ ఎయిర్‌ బర్డ్స్‌, పవర్‌ ఎడాప్టర్‌, లైటింగ్‌ కేబుల్‌, బ్యాక్‌కవర్లు అమ్ముతున్నారని ఆపిల్‌ కంపెనీ ఏజెన్సీ ఫిర్యాదు చేయడంతో నగరంలోని అన్నపూర్ణ కాంప్లెక్స్‌లో ఉన్న పంచరతన్‌ మార్కెటింగ్‌, శ్రీజీ మొబైల్‌ స్పేర్‌పార్ట్స్‌, మహాలక్ష్మి సెల్‌ వరల్డ్‌, చాముండా మొబైల్‌ షాప్‌పై దాడులు చేశారు. నకిలీ వస్తువులు సీజ్‌చేసి, యజమానులపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

గంగారెడ్డి హత్యపై అనుమానితుల విచారణ

- పలువురి సెల్‌ఫోన్లు స్వాధీనం
- కత్తి కోసం మూడు గంటల గాలింపు

జగిత్యాలక్రైం: కాంగ్రెస్‌ నాయకుడు మారు గంగారెడ్డి హత్యపై అనుమానితులను పోలీసులు విచారిస్తున్నారు. నిందితుడు వెల్లడించిన వివరాల మేరకు హత్యకు ఉపయోగించిన కత్తి గురించి గురువారం ఉదయం గ్రామ శివారులోని కంది చేలులో గాలింపు చర్యలు చేపట్టారు. అలాగే గ్రామానికి చెందిన కొంత మంది అనుమానితులను బుధవారం రాత్రి విచారించిన పోలీసులు వారి సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని వదిలిపెట్టినట్లు సమాచారం. గురువారం ఉదయం కూడా వారిని విచారించినట్లు సమాచారం. ఎస్పీ అశోక్‌కుమార్‌ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడితోపాటు, అతడితో సంబంధాలున్న వారి వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.

ఇంటర్‌ విద్యార్థులకు వరం

- ప్రభుత్వ కళాశాలల్లో పోటీ పరీక్షలకు కోచింగ్‌
- ప్రారంభమైన శిక్షణ తరగతులు
- జిల్లాలో 15 ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలు

జిల్లాలో ఇంటర్‌ ప్రభుత్వ కళాశాలల వివరాలు	
ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలు	15
ఫస్టియర్‌ విద్యార్థులు	2,684
సెకండియర్‌ విద్యార్థులు	2,275
మొత్తం విద్యార్థులు	4,959



మల్లాపూర్‌లోని కళాశాలలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న అధ్యాపకులు

మల్లాపూర్‌: ప్రభుత్వ జూనియర్‌ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఇంటర్‌ బోర్డు కృషి చేస్తోంది. ఈ ఏడాది నుంచి ఎంసెట్‌, జేఈఈ, నీట్‌ కోసం శిక్షణ ప్రారంభించింది. ప్రైవేటు కళాశాలల్లో కేవలం కోచింగ్‌కే రూ.50వేల వరకు తీసుకుంటున్నారు. ఇది నిరుపేద కుటుంబాలకు ఆర్థికభారం పడుతుంది. ఈ క్రమంలో ప్రభుత్వ కళాశాలల్లోనూ ఉచితంగా కోచింగ్‌ ఇవ్వడం ద్వారా అడ్మిషన్ల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధ్యాపకులు అంటున్నారు. ప్రస్తుతం జిల్లాలోని 15 కళాశాలల్లోని ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు కోచింగ్‌ ఇస్తుండటంతో తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


రోజుకు రెండు గంటలు..

ఈనెల ఏడో తేదీ నుంచి కోచింగ్‌ ప్రారంభమైంది. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు.. మధ్యాహ్నం మూడు నుంచి 4 గంటల వరకు క్లాసులు నిర్వహిస్తున్నారు. ఆయా అధ్యాపకులు మ్యాథ్స్‌, ఫిజిక్స్‌, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ వంటి సబ్జెక్టుల్లో కోచింగ్‌ ఇస్తున్నారు.


సదుపాయాలు లేక..

కళాశాల్లో కోచింగ్‌ ప్రక్రియ అరకొర సదుపాయాల మధ్య కొనసాగుతోందని విద్యార్థులు చెబుతున్నారు. ఇంటర్మీడియట్‌ బోర్డు నుంచి ఇప్పటివరకు కోచింగ్‌ మెటీరియల్‌ పంపించలేదు. కొన్ని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలల్లో నీటి సదుపాయం లేదు. మరి కొన్నిచోట్ల ప్రిన్సిపాల్స్‌ సొంత డబ్బుతో నీటి వసతి, చిన్నచిన్న మరమ్మతు చేయిస్తున్నారు. కలెక్టర్‌ స్పందించి నిధులు మంజూరు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు కోరుతున్నారు. తరగతులు ఉదయం ఒక గంట, సాయంత్రం ఒక గంట కాకుండా.. ఉదయం లేదా సాయంత్రం ఒకపూటే నిర్వహిస్తే సౌకర్యంగా ఉంటుందని విద్యార్థులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఇంటర్‌ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు కోచింగ్‌ ఇస్తుండగా.. మొదటి సంవత్సరం చదివే విద్యార్థులకు కూడా ఇస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.


ప్రత్యేక సమయం కేటాయించాలి


ఎంసెట్‌, నీట్‌, జేఈఈ కోచింగ్‌కు సంబంధించి కళాశాలలో ప్రత్యేక సమయం కేటాయించాలి. కోచింగ్‌, అనంతరం సబ్జెక్టుల బోధన.. రెండు కలపడంతో అయోమయానికి గురికావాల్సి వస్తోంది. కోచింగ్‌ ఆదివారం రోజున కూడా పెడితే బాగుంటుంది.
– జక్కని మనోజ్ఞ, విద్యార్థిని

మెటీరియల్‌ పంపించాలి


కోచింగ్‌కు సంబంధించిన మెటీరియల్‌ అందించాలి. మెటీరియల్‌ ఉంటే ఇంటికి వెళ్లాక కూడా చదువుకునేందుకు అనుకూలంగా ఉంటుంది. ఇంటర్మీడియట్‌ బోర్డు స్పందించి వెంటనే మాకు కావాల్సిన మెటీరియల్‌ పంపించాలి.
– గజ్జి లావణ్య, విద్యార్థిని

విద్యార్థులకు ప్రయోజనం


ప్రభుత్వ జూనియర్‌ కళాశాలల్లో నీట్‌, జేఈఈ, ఎంసెట్‌ కోచింగ్‌ విద్యార్థులకు ఎంతో ప్రయోజనం. ప్రైవేట్‌లో రూ.వేల ఖర్చుతో జరిగే కోచింగ్‌ ప్రభుత్వ కళాశాలల్లో ఉచితంగా ఇస్తున్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.
– వెంకటేశ్వర్లు, ఇంటర్‌ నోడల్‌ అధికారి

రాజన్న హుండీ ఆదాయం రూ.1.46కోట్లు


నగదు లెక్కిస్తున్న సిబ్బంది

వేములవాడఅర్బన్‌: దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ రాజన్నకు హుండీల ద్వారా రూ.1.46కోట్ల ఆదాయం సమకూరింది. దాదాపు నెల రోజుల తర్వాత హుండీలను గురువారం లెక్కించారు. నగదు రూ.1,46,16,253, బంగారం 211 గ్రాములు, వెండి 9.900 కిలోలు వచ్చినట్లు రాజన్న ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. లెక్కింపులో ఏసీ కార్యాలయ పరిశీలకులు సత్యనారాయణ, ఏఈవోలు, ఆలయ పర్యవేక్షకులు, శివరామకృష్ణ భజన మండలి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


శంకర్‌ (ఫైల్‌)

రామగుండం: అంతర్గాం మండలం మద్దిర్యాలకు చెందిన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. స్థానికుల వివరాలు.. మద్దిర్యాలకు చెందిన మాటేటి పెద్దరాములు–మల్లమ్మ దంపతులకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు కాగా అందరూ వివాహితులే. చిన్న కుమారుడు మాటేటి శంకర్‌(35). ఇతడికి భార్య శైలజ, 8, 5 ఏళ్ల ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సెంట్రింగ్‌ కూలీ పనులతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా ఇప్పటివరకు తల్లిదండ్రులు నివసించే ఇంటిలోనే ఇరుకైన గదుల్లో కుటుంబంతో కలిసి ఉండగా తండ్రి కుమారులకు పంచి ఇచ్చిన గుంట స్థలంలో మూడునెలల క్రితం సొంతింటి నిర్మాణానికి పూనుకున్నాడు. ఈక్రమంలో బుధవారం ఇంటి నిర్మాణ సామగ్రి తీసుకువచ్చేందుకు ద్విచక్ర వాహనంపై తన బావ పోచయ్యతో కలిసి మంచిర్యాలకు వెళ్లి సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. హాజీపూర్‌ సమీపంలో వెనుక నుంచి లారీ ఢీకొనడంతో శంకర్‌ అక్కడికక్కడే మృతిచెందగా, పోచయ్యకు తీవ్రగాయాలయ్యాయి. సొంతింటి కల నెరవేరకుండానే శంకర్‌ మృత్యు ఒడికి చేరాడు. సమాచారం తెలిసిన మరుక్షణమే మృతుడి భార్య స్పృహ కోల్పోయి కుప్పకూలిపోయింది. సౌమ్యుడిగా పేరున్న శంకర్‌ మృతిపై గ్రామస్తులు కన్నీంటి పర్యంతమయ్యారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్‌ సతీమణి మనాలిఠాకూర్‌ గురువారం శంకర్‌ అంతిమయాత్రలో పాల్గొని బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. బాధిత చిన్నారుల పోషణ భారాన్ని తానే చూసుకుంటానని హామీ ఇస్తూ వారికి అప్పటికప్పుడు ఆర్థికసాయం అందజేశారు.

చిట్టీల వ్యాపారి అరెస్ట్‌

జగిత్యాలక్రైం: జగిత్యాలలోని గోవిందుపల్లికి చెందిన చిట్టీల వ్యాపారి గాండ్ల వెంకన్నను అరెస్ట్‌ చేసినట్లు పట్టణ సీఐ వేణుగోపాల్‌ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ప్రభుత్వ అనుమతి లేకుండా విజయలక్ష్మీ అనే ఫైనాన్స్‌ పెట్టాడు. అధిక వడ్డీలకు ఫైనాన్స్‌ ఇచ్చాడు. ఇలా పట్టణంతోపాటు, వివిధ గ్రామాలకు చెందిన 60 మంది నుంచి డబ్బులు తీసుకుని ఏడాది క్రితం పరారీ అయ్యాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గురువారం అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు.

రూ.5లక్షలకే అగ్రికల్చర్‌ సీటు

- స్పెషల్‌ కోటా ప్రకటించిన వ్యవసాయ విశ్వవిద్యాలయం
- ఆన్‌లైన్‌ దరఖాస్తులకు నవంబర్‌ 1 చివరి తేదీ


పొలాస వ్యవసాయ కళాశాల

జగిత్యాలఅగ్రికల్చర్‌: ప్రొఫెసర్‌ జయశంకర్‌ తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయంతోపాటు కొండాలక్ష్మణ్‌ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో రూ.5 లక్షలకే బీఎస్సీ అగ్రికల్చర్‌, లేదా బీఎస్సీ హార్టికల్చర్‌లో సీట్లు పొందే అవకాశాన్ని వర్సిటీ అధికారులు కల్పించారు. ఇప్పటివరకు అగ్రికల్చర్‌, హార్టికల్చర్‌లో సీట్లు పొందేందుకు కన్వీనర్‌ కోటాతోపాటు 'ఎప్‌సెట్‌' ర్యాంకుల ఆధారంగా సెల్ఫ్‌ ఫైనాన్సింగ్‌ కోటా కింద రూ.10లక్షలకు సీట్లు ఇచ్చేవారు. వర్సిటీకి వైస్‌ చాన్స్‌లర్‌గా అల్దాస్‌ జానయ్య రావడం.. సామాన్యులకు వ్యవసాయ విద్య అందాలనే ఉద్దేశంతో స్పెషల్‌ కోటా సీట్లలో కొన్ని మార్పులు చేశారు. ఈ మేరకు నోటిఫికేషన్‌ విడుదల చేసి, ఆసక్తిగల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

స్పెషల్‌ కోటా కింద 465 సీట్లు

సెల్ఫ్‌ ఫైనాన్స్‌ కోటా తీసేయడంతోపాటు దానికున్న రూ.10 లక్షల ఫీజును స్పెషల్‌ కోటాగా మార్చి రూ.5లక్షలుగా పెట్టారు. తాజా నోటిఫికేషన్‌ ప్రకారం బీఎస్సీ అగ్రికల్చర్‌లో 401 సీట్లు, బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్‌లో 5 సీట్లు, బీటెక్‌ ఫుడ్‌ టెక్నాలజీలో 5 సీట్లు, బీఎస్సీ హార్టికల్చర్‌లో 54 సీట్లను కొత్తగా చేర్చారు. గతంలో మొత్తం డబ్బులు ఒకేసారి చెల్లించాల్సి ఉండగా.. మార్చిన నిబంధనల ప్రకారం సెమిస్టర్‌కు రూ.62,500 చొప్పున నాలుగేళ్లపాటు చెల్లిస్తే సరిపోతుంది. రైతుపిల్లలు, నాలుగేళ్లపాటు నాన్‌ మున్సిపల్‌ ఏరియాలో చదివిన విద్యార్థులకు కొంత మేర రిజర్వేషన్‌ ఉంటుంది.

వచ్చేనెల ఒకటి గడువు

స్పెషల్‌ కోటా దరఖాస్తులకు నవంబర్‌ 1 గడువుగా విధించారు. ఆన్‌లైన్‌ దరఖాస్తులు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఈ సీట్లను బైపీసీ చదివి.. తెలంగాణ ఎప్‌సెట్‌–2024 ర్యాంకుల ఆధారంగా మాత్రమే భర్తీ చేస్తారు. ఈ సీట్లను కేవలం హైదరాబాద్‌లోనే కాకుండా రాష్ట్రంలోని అన్ని వ్యవసాయ కళాశాలల్లో భర్తీ చేస్తారు. మరిన్ని వివరాలకు వ్యవసాయ వర్సిటీ వెబ్‌సైట్‌ పీజీటీఎస్‌ఎయూను సంప్రదించవచ్చు.

అప్పుల బాధ.. కోర్టు కేసు..

- ఆత్మహత్య చేసుకున్న సింగరేణి కార్మికుడు


నర్సయ్య(ఫైల్‌)

గోదావరిఖని(రామగుండం): అప్పుల బాధ ఒకవైపు, కొనుగోలు చేసిన భూమి కోర్టు కేసులో చిక్కుకోవడం మరోవైపు కార్మికుని ప్రాణాల మీదకు తెచ్చాయి. గోదావరిఖని వన్‌టౌన్‌ ఎస్సై శ్రీనివాస్‌ తెలిపిన వివరాలు.. స్థానిక విఠల్‌నగర్‌లో ఉంటూ ఓసీపీ–3లో డంపర్‌ ఆపరేటర్‌గా పనిచేస్తున్న మాదంశెట్టి నర్సయ్య(58) క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఏడేళ్ల క్రితం కరీంనగర్‌ బైపాస్‌లో భూమి కొనుగోలు చేశాడు. అయితే ఆభూమి కొనుగోలు సమయంలో రూ.20లక్షలు అప్పు చేశాడు. అదే సమయంలో అట్టి భూమిపై వివాదం ఏర్పడటంతో కోర్టు చుట్టూ తిరుగుతున్నాడు. అప్పుల భారం పెరగడంతో పాటు, స్థలం వివాదంలో ఉండటంతో మనస్తాపానికి గురైన నర్సయ్య బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో క్రిమిసంహారక మందు తాగాడు. కరీంనగర్‌లోని ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య శోభ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు రాకేశ్‌ ఉన్నారు. కొడుకు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.